కాళ్ళు అరిగిపోయేలాగ నగరంతా తిరిగి, ఒళ్ళంతా దుమ్ము కొట్టుకుపోయి, నీరసంగా కనిపిస్తూ రాజమ్మ శాంతికేఫ్ అరుగుమీద కూర్చుంది. శాంతికేఫ్ అరుగుమీద కూర్చున్నదన్న మాటేగాని ఆమెలో చెలరేగిన అశాంతి క్షణక్షణానికి పెరుగుతున్నదే గాని తరగడం లేదు. నాంపల్లి స్టేషనుకు ఎదురుగా ఉన్న వీధికి పక్కగా సందులో ఉన్నదే శాంతికేఫ్. శ్రామికులు, క్రిందితరగతి ప్రజలు ఎక్కువగా ఆ హోటలుకు వస్తూంటారు. రంగు రంగుల దుస్తులు ధరించి వన్నెచిన్నెల వేషధారణలతో డబ్బు ఉన్నవారు కారుల్లోనూ, కాలినడకనూ కళకళ లాడుతూ మెయిన్‌రోడ్డుమీద తిరుగుతున్నారు. అలా రోడ్డుకేసి చూస్తూ కూర్చుంటే ఎంతకాలమైనా గడిచిపోతుంది. కాని రాజమ్మ ఇదేమీ గమనించడం లేదు. ఆమె చేతిలో చిన్నసంచీ ఉన్నది. దాన్నే జాగ్రత్తగా పొదివి పట్టుకొని అప్పుడప్పుడు కాఫీ హోటలులోకి చూసేది. ఆమె సర్వస్వమూ ఆ చిన్న సంచీలోనే ఉన్నది. రాజమ్మ ఎండలో తిరగడంవల్లా, సరియైన తిండిలేకపోవటంవల్లా వాడిపోయినట్లు ఉంది గాని, సహజంగా ఆమె అందమైన మనిషి. ఆమెను ఒకసారి చూసినవాళ్ళు మరల తిరిగి చూడడానికి ఆమె ఆకర్షణీయమైన, పొందికైన దేహసౌష్ఠవమే కారణం.

పది సంవత్సరాల కుర్రవాడు గదిలోనించి ఏవో పదార్థాలు ప్లేట్లలో పట్టుకొని వచ్చి ఒక్కొక్క టేబిలుదగ్గిరకే వెళ్ళి పళ్ళేలు అందిస్తూ ఉంటే, ఆ కుర్రవాణ్ణి చూసినప్పుడల్లా ఆమె ప్రాణం లేచి వచ్చేది. ఆ కుర్రవాడు రాము. వాడు రాజమ్మకొడుకే.

రాజమ్మ, ఆమెభర్త, కొడుకు రామువాళ్ళ గ్రామంలో జరుగుబాటులేక, ఉన్న కొద్దిఆస్తి అప్పులవాళ్ళ పాలైపోగా హైదరాబాదునగరంలో ఏదైనా రెక్కల కష్టం చేసుకుబ్రతుకుదామని వచ్చారు. హైదరాబాదు వచ్చిన పదిహేను రోజులకే రాజమ్మ భర్త గుండె ఆగి చనిపోయాడు. రాజమ్మ తన కొడుకుని కాఫీహోటలులో పనిలో పెట్టింది, తనకేదైనా ఉపాధి దొరికేవరకూ వాడైనా రెండు పూటలా తిండికి మొగం వాచకుండా ఉంటాడని. రాజమ్మ నగరంలో తనకేదైనా పని దొరుకుతుందేమో నని వీధి వీధికీ, ఇంటింటికీ తిరిగి రోజూ సాయంత్రం తన కొడుకు దగ్గిరికి వచ్చేది.

హోటలు ప్రొప్రయిటరు రంగయ్య హోటలు గుమ్మానికి పక్కనే బల్లదగ్గిర కూర్చున్నాడు, ఖాతాదార్లకు ఏమేమికావాలో కనిపెడుతూ, నౌకర్లు సరిగా అందిస్తున్నారో లేదో చూస్తూ. రంగయ్య సన్నగా పొడుగ్గా ఉంటాడు. నడివయస్సువాడు. అతనికి ఇరవైనాలుగు గంటలూ డబ్బు వచ్చి టేబిలుసొరుగులో పడిపోవాలనే ఆకాంక్ష తప్ప మరేమీ లేదు. అంత మహానగరంలో మొదటితరగతి కాఫీహోటళ్ళపోటీ మధ్య చాకచక్యంతోనే హోటలు వ్యాపారం నిర్వహిస్తున్నాడు.

రాజమ్మ వచ్చి అరుగుమీద జారగిలబడడం చూశాడు గాని, కొంతసేపైన తరవాతగాని ఆమెను అతను పలకరించలేదు. "ఏం రాజమ్మా, మళ్ళీ వచ్చేశావు? ఈ వేళకూడా మామూలేనా? ఏమైనా పని దొరికిందా?" అన్నాడు.

రాజమ్మ తలఎత్తి కిటికీలోనించి చూసింది. ఆమె కళ్ళు కన్నీళ్ళతో నిండిఉన్నాయి. ఆమె మొగం అలసటతో నీరసించి వాడిపోయినట్లుగా హోటలులైట్ల కాంతిలో కనబడింది.

***దిక్కులేని ఆడది వయసులో ఉండి విధవపడితే కనికరించి కన్నీరు తుడిచేవారు కనిపించరు గానీ, అవినీతి రొంపిలోకి జార్చడానికే అందరూ ప్రయత్నిస్తారు. ఆడదాని శీలాన్ని అనుభవించడమే మహా ఘనకార్యంగా భావించే పురుష పుంగవులు పుష్కలంగా ఉన్నచోట, అనాథలైన అబలల ఆశలు వమ్ముకాకమానవు.***

"నాకు వెళ్ళడానికి ఇంక చోటేది బాబూ" అన్నది నీరసంగా.

నువ్వు పొద్దుటనగా వెళ్ళిపోయావు. ఇక నువ్వు రావేమో అనుకున్నాను. నువ్వు దారిగాని తప్పిపోయావేమో, లేక నీ భర్తలాగ నీ గుండెకూడా ఆగిపోయిందేమో అనుకున్నాను" అని రంగయ్య తనేదో చమత్కరించినట్టు నవ్వాడు.

రంగయ్య మాటల మొరటు ధోరణికీ, ఆమె భర్తను జ్ఞాపకం చేసిన విధానానికీ రాజమ్మ ఒక్కసారి గొల్లుమంది.

పెల్లుబికే ఏడ్పును అణచిపెట్టి "రంగయ్యగారూ, నా కొడుకును గురించి బ్రతికిఉన్నాను గాని, లేకపోతే మీరు చెప్పినట్లే మరోలాగో ఎప్పుడో చచ్చిపోయి ఉండేదాన్ని" అన్నది.

రాజమ్మ చెప్పేది రంగయ్య వినలేదు. ఎవరో ఆసామీ చెల్లించే బిల్లు డబ్బు తీసుకొని చిల్లర ఇస్తున్నాడు. ఖాతాదారు వెళ్ళిపోయాక ఒక కారాకిళ్ళీ పట్టుకొని బుగ్గలో కూరుకున్నాడు. మరి కొంత సున్నం వేలికి రాసుకొని నాలికకు పట్టించుకున్నాడు. అతని జిహ్వ పాతరుచినే కొత్తగా అనుభవించింది.

కిటికీలోనించి రోడ్డుమీదకు కస ఉమ్ముతూ "ఈ వేళ ఏమైనా పని దొరికిందా?" అన్నాడు.

"లేదు, అంతా మామూలే" అన్నది.

"నేను చెప్పలేదా నువ్వు పని సంపాదించలేవనీ నీకు దొరకదనీ" అన్నాడు రంగయ్య తన జోస్యం నిజమైనందుకు వికారంగా నవ్వుతూ.

"మీరు చెప్పింది నిజమే. నాలాటిదానికి పని ఇవ్వడానికి ఎందుకో ఎవరూ ఒప్పుకోవడం లేదు. పైగా దొంగలు, మోసగాళ్ళు ఇదే పేరుతో వస్తున్నారని అంటున్నారు. ఎవరైనా నేను మంచిదాన్ననీ, నమ్మకస్తురాలినేననీ పరిచయం చేస్తే తప్ప పని ఇవ్వమంటున్నారు. ఒక భోజనంహోటలులో పని ఇస్తామన్నారు గాని ఆ యజమానులు చూసినచూపులు నాకు నచ్చలేదు" అన్నది.

"ఏం వాళ్ళు నీ కళ్ళకు నచ్చలేదా?" అన్నాడు

## ఊరంకి వెంకటరావు

నవ్వునవ్వు నవ్వుతూ రంగయ్య. మళ్ళీ కిళ్ళీకస ఉమ్మేశాడు.

అప్పుడే రాము భయపడుతూ, భయపడుతూ వాళ్ళమ్మని చూసి నవ్వుతూ వీధిగుమ్మం దగ్గిరకి వచ్చాడు.

"ఎందుకురా ఇలా వస్తున్నావు? చూడు ఆ నాలుగో బల్లదగ్గిర ఆసామీ మంచినీళ్ళ కోసం గొణుక్కుతున్నాడు. వినపడలేదూ?" అన్నాడు రంగయ్య కఠినంగా. రామూ గబగబా వెనక్కి వెళ్ళిపోయాడు.

రాజమ్మ ఏమీ చెయ్యలేక అలా చూస్తూ ఊరుకుంది. "రంగయ్యగారూ, ఈ ఊళ్ళో ఏదో అనాథశరణాలయం ఉందట! ఆ శరణాలయంవాళ్ళు అనాథస్త్రీలకు ఏదో వృత్తివిద్య నేర్పడమో, పని చూపెట్టడమో చేస్తారట. మీకేమైనా ఆ విషయం తెలుసునా?" అని అడిగింది.

రంగయ్య ఆమెకేసి తీక్ష్ణంగా చూశాడు. తను ఆమెను అంచనా వేసినదానికంటే ఆమె తెలివైనది లాగ కనబడింది.

"అయితే నువ్వు ఆ సంస్థ సహాయం కోరుతావన్న మాట. అలాగే కోరు. అయితే అక్కడ కూడా నీ పరిస్థితులు బాగా లేకపోతే నన్ను నిందపెట్టకు. నేను నిన్ను ముందుగా హెచ్చరించలేదనుకోకు. నీకు నిజం చెప్పాలంటే అలాటి శరణాలయాల్లో కూడా సంఘసేవ చేస్తున్నామనేవాళ్ళు అమాయకులైన ఆడవాళ్ళను వలచి, దూరప్రాంతాలకు తీసుకుపోయి అమ్మేస్తున్నారు. అదొక ముఠా సన్నుగడ. కాని ఆ పద్ధతే నీకు నచ్చితే ఎవరూ నిన్ను అడ్డుపెట్టలేరు. నీ అందం యౌవనం చెడనంత కాలం నీ రోజులు దర్జాగా వెళ్ళిపోతాయి. కాని నీ కొడుకు నీకు దూరమైపోతాడు. అదొక్కటే చిక్కు."

రాజమ్మ అతనికేసి తెల్లబోయి చూసింది.

"అయితే మీరు చెప్పేదంతా నిజమేనంటారా?" అని అడిగింది అమాయకంగా.

"నేను చెప్పేదాంట్లో నీకు నమ్మకం లేకపోతే అదేమిటో స్వయంగా నువ్వే తెలుసుకోరాదూ?" అన్నాడు రంగయ్య కోపం నటిస్తూ. "నీకు హైదరాబాదువంటి మహానగరాల్లో జరిగే మోసాలు కనిపెట్టగలిగే తెలివితేటలు లేవు. నాకు అన్నీ తెలుసు. నేను ఇక్కడ పుట్టి పెరిగాను."

రాజమ్మకు ఆ అవకాశం కూడా లేకుండా పోయింది. రాజమ్మ మళ్ళీ ఆలోచనలో పడింది. "రంగయ్యబాబూ, ఇక్కడ ఏవో మిల్లులూ, పరిశ్రమలూ ఉన్నాయట. వారు ఆడకూలీలకు పని ఇస్తారుట" అన్నది తనకు పని దొరుకుతుందేమోననే ఆశతో.

రంగయ్య రాజమ్మ ఏదో హాస్యం మాట్లాడినట్లుగా నవ్వాడు. "అవును. ఇక్కడ చాలా పరిశ్రమలు ఉన్నాయి. వాళ్ళు ఆడవాళ్ళకి పని ఇస్తారుకూడా. కాని నువ్వు ఆ పని చెయ్యగలవా అని. నీ సన్నని నడుము పనిభారంతో ఒక రోజులో వంగిపోతుంది. నీ అందం అంతా మరోరోజుతో మాడి చక్కాపోతుంది. నువ్వు ఆ మిల్లులో పని చెయ్యవచ్చుగాని, కూలీలమీద పెత్తనం చెలాయించే మేస్త్రీకి నీ మీద ఎప్పుడు మోజు పుట్టినా పుట్టవచ్చు" అని రంగయ్య నవ్వాడు.

రాజమ్మ చెక్కిళ్ళు కోపంతో ఎరుపెక్కాయి. కాని ఆమె ఏదో అనే లోపలే కాఫీహోటలు వెనక



# మారని బ్రతుకు

భాగంలో గాజుగ్లాసులు, పింగాణీప్లేట్లు దొర్లిపోయి నట్టు, బద్దలయినట్టు చప్పుడయింది.

"ఏమిట్రా చేస్తున్నారు కుర్రవెధవల్లారా?" అని అరిచాడు రంగయ్య.

రామూని చెవి పట్టుకొని మరో పెద్దకుర్రాడు రంగయ్య బల్ల దగ్గిరికి ఈడ్చుకువచ్చాడు. "ఈ వెధవ మళ్లీ రెండు ప్లేట్లు బద్దలు కొట్టాడండీ" అన్నాడు నేరస్థుణ్ణి పట్టి ఇస్తున్నట్లుగా.

రంగయ్య ఆవేశంలో ఒళ్లు మరిచిపోయాడు. "ప్రొద్దుట ఒక ప్లేటు బద్దలు కొట్టావు జ్ఞాపకముందా" అని ఉరిమాడు రామూకేసిచూసి. రాము భయంతో తల ఎత్తలేక వణికిపోతున్నాడు. "ఈ లెక్కని నేను త్వరలోనే దివాలా తియ్యాలి!" అని అంటూ "ఒరే, వాణ్ణి ఓ రెండు లాగు, జ్ఞాపకం ఉండేలాగ" అన్నాడు పెద్దకుర్రాడితో. ఈ మాట విని రాజమ్మ గబగబా హాలులోకి వచ్చింది. "రాజమ్మా, దూరంగా ఉండు, ఈ గొడవలోకి నువ్వు రాకు" అని అరిచాడు రంగయ్య.

రంగయ్య హుకుం వెంటనే పెద్దకుర్రాడు అమలు

(తరువాయి 34 వ పేజీలో)

( 31 వ పేజీ తరువాయి)

జరిపాడు తనేదో సాధించినట్లుగా. రాము ఒక్క అరుపు అరిచి మూలుగుతూ ఏడ్చాడు. వాణ్ణి రెక్క పట్టుకొని లోపలికి లాక్కుపోయాడు పెద్ద కుర్రాడు.

రాజమ్మ రంగయ్య బల్లపక్కనే కూలబడింది. ఆమె కళ్లనిండా నీళ్లు నిండాయి.

ఒక క్షణం పోయిన తరవాత కన్నీరు తుడుచుకుంటూ రాజమ్మ అన్నది. "రంగయ్యబాబూ, నేను పనికోసం ఎందుకు ఆరాటపడుతున్నానో తెలుసా?"

రంగయ్య బీడీ వెలిగించి "ఊ" అన్నాడు.

"నా కొడుకును గురించే. వాడు ఈ పని చెయ్యలేడు. వాడిది చాలా లేతవయస్సు. ఈ వయస్సులో వాడు స్కూలులో చదువుకోవాలి" అన్నది.

"బళ్లోనా? చదువుకుంటే వాడికేం వస్తుంది? కొంతకాలం చదివితే నీ కొడుకు ఏమైనా మొగలు చక్రవర్తి అయి నెమలిసింహాసనంమీద కూర్చుంటాడా? వాణ్ణి నా దగ్గిరే వదిలెయ్యి. ఇలాటి హోటలుపనిలోనే వాణ్ణి రాటుదేరనియ్యి. వాడికింకా మంచిపని దొరకచ్చు. ఈ రోజుల్లో భోజనం పెట్టి నెలకు పది రూపాయ లివ్వడమంటే మాటలు కాదు."

"కాని చదువులేనివాడు గుడ్డివాడితో సమానం..." అని ఇంకా ఏదో చెప్పబోయింది రాజమ్మ.

"నీతో బాతాఖానీ వేసుకు కూర్చుందుకు నాకు వీలులేదు. నీకు విశ్రాంతి కావాలంటే మేడమీద వెళ్లు. లేకపోతే నీ ఇష్టం వచ్చినచోటుకి వెళ్లు" అన్నాడు రంగయ్య. రంగయ్యకు తెలుసు ఆమెకు మరొకచోటు లేదని.

ఆమెను పంపిన హోటలు మేడమీది గది చాలా చిన్నది. దోమలతో నిండిపోయి ఉంది. ఆ గదికి గిలాబాచేసిన సున్నపుబెల్లులు చాలా చోట్ల ఊడి పోతున్నాయి. ఆ గదిలో పగిలిపోయిన అద్దంతోఉన్న టేబిలూ, ఊగిసలాడే కుర్చీ, పాట్టిమంచం, అందుమీద నలిగిపోయి, ఉండలు చుట్టుకుపోయి, కంపుకొట్టే పరుపూ ఉన్నాయి.

ఆ గదిలోనే రాజమ్మ ఎక్కడికీ వెళ్లకుండా మూడు రోజులు ఉండిపోయింది. ఆమె కొడుకు రెండు పూటలా అన్నం తెచ్చి ఆమెకు పెట్టేవాడు. వాడు ఆమెకు అన్నం తెచ్చినప్పుడే ఆమె ఒళ్లో కూర్చుని ఆ కబురూ, ఈ కబురూ చెప్పి కాసేపు ఏడ్చేవాడు. రంగయ్య దాతృత్వంమీద అలా ఎన్నాళ్లు ఉండాలో ఆమెకు అర్థం కాలేదు.

మూడో రోజు సాయంత్రం రంగయ్యమేడమీదికి వచ్చాడు. రాజమ్మ బాగా పరిస్థితులకు లొంగిపోయినట్లు కనిపించింది.

"చాలా దిగాలు పడినట్లు కనిపిస్తున్నావు. అప్పుడప్పుడు నీతోకూడా ఎవరైనాఉంటేబాగుంటుంది' అని ఆమె క్షేమం కోరినట్లు మాట్లాడుతూ గది అంతా కలయచూశాడు.

"ఈ గదికి కొంత కళ రావాలి. ఈ గదిలో ఇంతకుముందు ఉండేమనిషి చాలా అశ్రద్ధమనిషి. ఆమె నాకు సంపాదించి పెట్టేనదానికంటే నేను ఆమెమీద ఎక్కువ ఖర్చు చెయ్యవలిసి వచ్చేది. అప్పటికీ ఆ ముండ ఎవడో దళారీవాడితో లేచి పోయింది. ఇప్పుడు ఎక్కడో గుడిసె వేసుకొని ఉందిట. నువ్వు దానిలాగ విశ్వాసం లేకుండా ఉండవనుకొంటాను" అన్నాడు రంగయ్య.


రంగయ్య ఆమెకేసి చూశాడు. తను చెప్పినది ఆమెకు బోధ పడినట్లుగా లేదు. రంగయ్య కాస్సేపు గదిలో ఉన్నాడు.

"నిను కాలక్షేపానికి ఎవరినైనా పంపితే నువ్వు అవకాశం జారవిడుచుకోకుండా సరిగా ప్రవర్తిస్తా వనుకొంటాను" అన్నాడు రంగయ్య.

"బహుశా అలాగే చేస్తాను రంగయ్యబాబూ" అంది రాజమ్మ పరాకుగా, అతనన్నదేమిటో పూర్తిగా అర్థం చేసుకోకుండా.

రంగయ్య ఆనందించాడు. "నువ్వు పరిస్థితులు గమనించి దారికి వస్తున్నందుకు చాలా సంతోషం" అని అంటూ రంగయ్య వెళ్లిపోయాడు.

అతను వెళ్లిపోయాక రాజమ్మ ఆలోచనలో పడింది. ఆమెలో ఏవో భయ, సందేహాలు కలిగి క్రమంగా హెచ్చువారంభించాయి.



మీద కూర్చుంది. చల్లటి గాలి ఆమె శ్రమను, కష్టాన్నీ మరపింపజేసింది.

ఇంతలో ఏదో చీకటిలో మొక్కలపక్కని కదులుతున్నట్లనిపించింది. అంజనేయులు మొక్కలవెనకనించి వచ్చాడు. అతని నడక తూలుతున్నట్లు ఉంది. చేతిలో సీసా ఉంది. అతను వచ్చి రాజమ్మ కెదురుగుండా నిలుచున్నాడు.

"నువ్వు తాగావా ఆంజనేయులూ?" అని ఆశ్చర్యపోతూ అడిగింది రాజమ్మ.

"ఏం, ఎందుకు తాగకూడదు? యజమానిలాగే సేవకుడు!" అన్నాడు ఆంజనేయులు, తన విజ్ఞానం, తెలుగూ మిళితంచేసి, తన పాండిత్యాన్ని బయట పెడుతూ. అతను ఆమె పక్కనే కూర్చున్నాడు. ఆమె కొంచెం జరిగింది.

"పట్టు, మనం ఇద్దరం తాగుదాం" అన్నాడు ఓ సీసా ఎత్తుతూ. "ఇంకా కొంచెం ఉంది. ఒకటోరకమైన సరుకు. అయ్యగారి అలమారులోది పట్టుకువచ్చా" అన్నాడు.

రాజమ్మకి నవ్వాలో, అతని పిచ్చిఆలోచనకి ఆగ్రహించాలో తెలియలేదు.

"సిగ్గు లేకపోతే సరి. ఈ వయస్సులో నీకు ఇదొకటి తక్కువ వచ్చింది" అన్నది ఎలాగో.

"నా కేమిటి లోటు?" అని అంటూ తను కొంత తాగి, ఆ సీసా ఆమె నోటిదగ్గర పెట్టబోతూ "రా, తాగు ఇంకా కొంచెం ఉంది. ఇది తాగావంటే నీలో కోరికలు మేలుకొంటాయి.

ఆమె సీసా తోసేసింది. అది నేలమీద పడిపోయింది. ఆంజనేయులు బుర్ర అటూ ఇటూ తిప్పుతూ సీసాకేసి దీనంగా చూశాడు. అంతలోకే "రాజమ్మా, నువ్వు నన్ను పెళ్ళి చేసుకుంటావా? నిన్ను చూసిన క్షణంలోనే నాకు పిచ్చెక్కిందనుకో" అన్నాడు.

అతని మాటలు ఆమెమీద పిడుగుపడినట్లయాయి.

"ఏమిటి పేలుతున్నావు? నేను నీ కూతురులాటిదాన్ని" అన్నది రాజమ్మ ఎలాగో.

"కూతురు, హు. దాని సిగ తరిగిరి! కూతురని ఎవరన్నారు? పెళ్ళామని నే నంటూంటే! నీ గురించే అంటూన్నది" అని అంటూ ఆమె చెయ్యి పట్టుకున్నాడు. రాజమ్మ విదిలించేసింది. ఆంజనేయులు బోర్లాపడ్డాడు మూలుగుతూ.

రాజమ్మ కంగారుగా మేడఇంటివైపు పరిగెత్తింది. ఒక్క గది తప్ప మిగతా అన్ని గదులలోను దీపాలు ఆరిపోయి ఉన్నాయి. అంతా చీకటిగా ఉంది. చీకటిలో తడుముకుంటూనే వెళ్ళి, ఆ ఇంటికి అవతలివైపు వరండా చివర పడుకున్నది. విందు ఇంకా జరుగుతూంది. ఎవరో కర్ణకఠోరంగా పాడుతున్నారు. దానికే చప్పట్లు కొడుతున్నారు. పొందిన మానసికాందోళనకు నీరసం వచ్చి రాజమ్మ వెంటనే నిద్రపోయింది.

కొంతసేపు పోయిన తరవాత ఏదో వచ్చి ఆమెను "ఢీ" కొట్టినట్టయింది. ఆమె భయంతో లేచి కూర్చుంది. ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. ఆ నిశ్శబ్దం ఆమెకు మరింత భయాన్ని కలిగించింది. ఆ చీకటిలో ఆమె కమలాకరరావును పోల్చుకోగలిగింది. అతను తన గదివైపు తూలుతూ వెళ్ళి, గుమ్మం ముందు ఆగి మళ్ళీ వెనక్కి వచ్చాడు.

ఆమెమీదికి వంగి "ఎవరూ, రాజమ్మా?" అన్నాడు. అతని నిశ్వాసలో నుంచి ఘాటైన మద్యంవాసన వచ్చి ఆమె బుర్ర తిరిగింది.

"ఇక్కడ చలికి కొయ్యబారిపోతావు. నా గదిలోకి వస్తే మంచిది" అని అంటూ ఆమె చెయ్యి పట్టుకుని లేవదీయబోయి తూలి పడిపోయాడు. మంత్రంవేసిన దానిలాగ రాజమ్మ చూస్తూంది. ఆమెకు ఏమి చెయ్యాలో తోచడం లేదు. అతను మోచేతులమీద ఆనుకొని తూలుతూ లేచాడు. "లోపలికి రా, చెబుతూంటే వినపడడం లేదా?" అన్నాడు.

రాజమ్మ ఎలుగుబంటిని తప్పించుకొని పులినోట్లోకి వచ్చి పడినట్లు అనుకుంది.

"బాబుగారూ, నేను చాలా కష్టాలు అనుభవించాను. నన్నిలా ఉండనివ్వండి. నేను దిక్కులేనిదాన్ని. నన్ను దయదలచండి" అన్నది.

కమలాకరరావు ఆమెను వదలలేదు. చెయ్యి పట్టుకొని లాగాడు. రాజమ్మ గట్టిగా అరిచింది. ఆ కేకతో అతని భార్య కంగారుగా పరిగెత్తుకు వచ్చింది. లైటు వేసింది. భార్యను చూడగానే కమలాకరరావు చల్లగా తన గదిలోకి జారుకుని తలుపు లోపల గడియ వేసుకున్నాడు.

ఒక్క క్షణం అతని భార్య రాజమ్మవైపు తీక్ష్ణంగా చూసింది.

"ఇక్కడేం చేస్తున్నావు? నీలాటివాళ్లని చాలా మందిని చూశాను. నువ్వు ఇక్కడి కెందుకు వచ్చావో నాకు తెలుసు, నా మొగుణ్ణి బుట్టలో వేసుకుందుకు!" అన్నది కళ్ళు ఎర్రజేస్తూ.

రాజమ్మ ఏదో చెప్పబోయింది. కాని యజమాని భార్య తోకతొక్కిన తాచు అయింది. రాజమ్మచాప, నంచీ అన్నీ ఇవతల పారేసింది. "ఫో ఇక్కడినించి, ఈ తక్షణం ఫో. నీ వెధవమొహం మళ్ళీ నా కళ్ల బడిందంటే నిన్ను నిలువునా చీరేస్తాను, ఫో" అన్నది.

ఆ క్షణంతో రాజమ్మపతనం ఆరంభమైంది. బహుశా ఈ ప్రపంచంలో నీతిగా ఉన్నట్టు కనపడే మనుష్యులే అవినీతిపరుల సంఖ్యనుమించి ఉంటారేమో! కాని దుష్టులూ, అవినీతిపరులూ కాచుకొని ఉండి ఆమెను ప్రతీక్షణం బురదలోకి ఈడ్చడానికి ప్రయత్నిస్తూ ఉంటే? ఏ ఒక్క నీతిపరుడూ ముందుకి రాలేదు. "రాజమ్మా, ఎందుకలా ఏడుస్తావు? ఎందుకు నీ కొడుకు అలా నిన్ను పట్టుకొని వేళ్లాడుతున్నాడు? నీ కొడుకు ఆకలి నన్ను తీర్చనీ, నీ కన్నీళ్ళు నన్ను తుడవనీ" అని ఎవరూ ఆమెను ఓదార్చలేదు. ఆమెను ఆదుకొనలేదు. కనీసం ఒక చల్లనిమాట, చక్కని ఆలోచన, ఆమెకు కొంత ఊరట కలిగించి ఉండేవి. కాని నీతిపరులు దేనికీ కలగజేసుకోరు. ఏదీ చూడరు. ఏదీ వినరు. తమ కెందుకులే అన్న నిర్లక్ష్యభావంలో వారు కుడి, ఎడమలకు మొగ్గరు.

అన్ని మార్గాలూ, అన్ని ద్వారాలూ మూతపడిపోయిన తరవాత రాజమ్మ గత్యంతరం లేక తనకు పరిచయం అయిన ఒకే ఒక ప్రదేశం శాంతికేఫ్‌కు వెళ్ళింది.

తనకు పరిచయమైన ఆ వీధి, ఆ సందు, ఆ ఇళ్ళు చూసి రాము "అమ్మా, మనం మళ్ళీ ఎక్కడకు వెడుతున్నాం? ఈ ప్రాంతం నాకు నచ్చదు. పదమ్మా, వెళ్ళిపోదాం" అన్నాడు. రాజమ్మ వంగి అతని బెదురు చూపులు చూసి కొడుకును హత్తుకుంది.

"భయంలేదురా. నువ్వింక పని చెయ్యనక్కరలేదు. నేను నిలువునా తగలబడిపోయినా నిన్ను చదివిస్తాను" అన్నది. ఆమె మాటలు రాముకు అర్థం కాలేదు.

• • •

రంగయ్య దినచర్య ప్రారంభం కోసం కుర్చీలో కూలబడ్డాడు. బీడీ వెలిగించబోతూ రాజమ్మను చూసి గతుక్కుమని ఆగిపోయాడు.

"రంగయ్యగారూ, నేను మళ్ళీ వచ్చాను" అన్నది. ఆమె ముఖంలో ఏ విధమైన కళా, కాంతులూ లేవు. నిర్వికారంగా ఆమె ఉన్నది.

రంగయ్యకు ఏమీ బోధపడక ఆమెకేసి చూస్తూ ఉన్నాడు.

"మీకు వినపడలేదా? నేను ఇక్కడ ఉండిపోవడానికి వచ్చాను. మేడమీద గదిలోకి వెళ్లమన్నారా?" అన్నది.

రంగయ్య తెరిచిన నోరు మూయలేదు. ఆమెవేపు అచేతనంగా చూశాడు. ★



